ఉదయం ఉగాది సంచిక మార్చి 22, 1991

# సముద్రుడు

## జీవనసముద్రంలో అడుగున రత్నాలు

చౌదరి బాల్కనీలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు. రాత్రి పదయిందిి.

చల్లని వెన్నెల బాల్కనీలో కురుస్తోంది. సముద్రం మీంచి గాలి.. మనోహరంగా వస్తోంది.

చౌదరి భార్య లలిత ఇంట్లో పనిపూర్తి చేసుకుని వచ్చి భర్త ఎదురుగా కుర్చీలో కూర్చుంది.

భార్యకేసి చూశాడు చౌదరి.

ఆమె చల్లగా నవ్వింది.

ప్రతి రోజూ రాత్రి వాళ్ళు సముద్రంకేసి చూస్తూ నిద్రవచ్చేవరకూ కబుర్లు చెప్పుకుంటారు.

''రేపు మన మారేజ్ డే' అంది లలిత.

భార్యవంక చూసి చిరునవ్వుతో ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని

''అప్పుడే నలభై అయిదేళ్ళు గడిచిపోయినాయా లలితా?'' అన్నాడు చౌదరి.

''పిల్లలపెళ్ళిళ్ళు అయిపోయినాయ్. బంగారంలాంటి ఉద్యోగాలు చేసుకుంటున్నారు వాళ్ళు, మనవళ్ళు మనవరాళ్ళు పుట్టారు. అప్పుడే నలభై అయిదేళ్ళా అంటున్నారింకా?''

అంది మందహాసం చేస్తూ అంది.

చౌదరి మళ్లీ ఓ సిగరెట్ వెలిగించాడు.

''అప్పటికీ ఇప్పటికీ చెక్కు చెదరని నీ అందం చూస్తుంటే నిన్నకాక మొన్నే మన పెళ్లి అయిందేమో అనిపిస్తుందోయ్!'' అన్నాడు చౌదరి.

''చాల్లేండి. ఇంత వయసొచ్చినా కుర్రతనం మాత్రం పోలేదు మీకు''

''అది నీ గొప్పతనమే! నేనిలా ఎవ్వర్‌గ్రీన్ హీరోలా వున్నానంటే కారణం నీ అందమే''

''కదిపితే చాలు నన్ను పొగడడం తప్ప ఏదీ చేతకాదు మీకు. రేపు స్పెషల్ ఏం చేయమంటారో చెప్పండి'' అంది లలిత.

చౌదరి నవ్వి—

''ఇప్పుడే వస్తాను'' అని లోపలికి వెళ్లి ఓ పేకెట్ తీసుకొచ్చాడు.

''చీర తీసుకొచ్చారా?'' అంది ఆ ప్యాకెట్‌ని అందుకుంటూ.

''ఊ''

''మీ చాదస్తం మానరు. ఇప్పటికీ గుర్తుంచుకుని ప్రతి మారేజ్‌డేకి నా కోసం కొత్త చీర తెస్తారు. మీకు మాత్రం '' ఆమె మెల్లగా అంది.

''అందమే ఆనందం, ఆనందమే జీవితమకరంధం' అన్నారు లలితా! నిన్నుతప్ప నేను ఇంకేమీ ఆశించను. నువ్వు నా సర్వస్వానివి. నీ కంటే నాకేం కావాలి?''

''మీరెప్పుడూ ఇంతే! మీ గురించి మీకెప్పుడూ పట్టదు.'' చిరుకోపం ప్రదర్శించింది లలిత.

చౌదరి ఆమె చెంప మీద చిటికెవేసి సిగరెట్ వెలిగించబోతుంటే అంది లలిత.

''మీ ఈ అలవాటు మాత్రం మానిపించలేకపోయాను. రేపట్నుంచీ సిగరెట్లు కాల్చనని మాటివ్వండి?'' అంది.

''అయితే ఈ రాత్రి నిద్రపోకుండా ఎన్ని సిగరెట్లు కాల్చగలనో అన్ని కాల్చుకుంటాను''

''ఒక్కసారి మానమడం ధర్మంకాదు. మీరు మానలేరనీ నాకు తెలుసు. మిమ్మల్నెందుకు ఇబ్బంది పెట్టాలి. రోజూ మూడు సిగరెట్లు కాల్చుకోవడానికి మీకు పర్మిషన్ ఇస్తున్నాను. పొద్దున్న, మధ్యాహ్నం, రాత్రి...''

''అయితే రోజూ నువ్వు నాకు ఇరవై ఏడు ముద్దులు ఇవ్వాలి!'' అన్నాడు చౌదరి చిలిపిగా.

''ఛీ... అదేం లెక్క!?''

''రోజూ మూడు పెట్టెల సిగరెట్లు నేను కాలుస్తాను. అంటే ముప్పై.

మూడు సిగరెట్లు పోతే మిగిలిన ఇరవై ఏడు బదులు నువ్వు అన్ని ముద్దులు ఇవ్వాలన్నమాట!

''ఏదో వంకతో అదే టాపిక్ లోకి వస్తారు''

''టాపిక్ మాత్రమే కాదుగా! ఇంకా లైన్‌లోనే ఉన్నాను కదా!'' ఆమె చెంపల్ని చేత్తో సవరదీస్తూ అన్నాడు చౌదరి.

''ఇంతకీ రేపు ప్రోగ్రాం చెప్పలేదు'' అడిగింది లలిత.

చౌదరి చెప్పాడు.

''ఉదయం గుడికి వెళ్దాం. సాయంత్రం మొదటి ఆట సినిమా చూసి, ఏదన్నా హోటల్లో భోజనం చేద్దాం.''

''ఉదయం ఏదో సింపుల్‌గా చేసుకో''

ఆమె తలూపింది.

మర్నాడు హోటల్లో భోజనం చేసి ఇంటికి వచ్చాక దారిలో కొన్న మల్లెపూలు మంచంపైన పోశాడు.

''ఇదేం పని!'' నవ్వుతూ అడిగింది లలిత.

''ఇవేళ ఇద్దరం ఒకే మంచంమీద పడుకుందాం!'' కొంటెగా అన్నాడు చౌదరి.

లలిత సిగ్గుపడింది.

ఆనాడు పెళ్లి చూపుల నాడు సిగ్గుపడుతూ తన ముందుకొచ్చి కూర్చున్న పదిహేనేళ్ల లలితలా కనబడిందావిడ కళ్ళకి.

''[illegible]''

''ఊ''



ఏదేశంలోనైనా సరే ఎంతమంచి ఉన్నత న్యాయస్థానమైనా సరే దాని ఆవరణలో ఎంత మంచి పూలమొక్కలు పెంచినా వాటికి

''తలుపువేసిరా!''

''ఛీ.. అయినా ఇంట్లో ఎవరున్నారని''

''ఇంట్లో ఎవరున్నారన్నది పాయింట్ కాదు. శోభనంగదికి తలుపులు వేసుకోవడం రివాజు''

లలిత ఫక్కుమని నవ్వింది.

''ఈ వయసులో శోభనమా?''

''మనసుంటే వయసుతో నిమిత్తం

## పైపైన లౌక్యతరంగాలూ!ప్చ్.!

ఉండదు. నిన్ను చూస్తుంటే నేను కుర్రసన్యాసినై పోతాను. అందుకే నాకైతే రోజూ శోభనం చేసుకోవాలనుంటుంది''

''సరే! మీ మాట ఎందుకు కాదనాలి?'' అని తలుపువేసి వచ్చింది లలిత. ఆమె కాస్త అలిసిపోయినట్లుగా కనిపిస్తోంది.

ఆమెని పక్కనే కూర్చోబెట్టుకుని ఆమె మొహాన్నితన అరచేతుల్లోకి [illegible] చౌదరి.

''లల్లీ! నేనెంత అదృష్టవంతుడినో తెలుసా! [illegible]

గెలిపించావు. ఇన్నేళ్ల కాపురంలో కనీసం నాపైన చిరాకుని కనబరచలేదే నువ్వు..''


''మిమ్మల్నే గెలుచుకొన్న నాకు వేరే గెలుపెందుకండి. నలుగురు పిల్లల్ని ఇచ్చారు. కొండంత మీ మనసుని నాకు అంకితం చేశారు. ఇంతకంటే ఆడదానికి ఏంకావాలి!''

''చాలు లల్లీ!'' తృప్తిగా ఆమెని గుండెకి చేర్చుకున్నాడు చౌదరి.

లలిత చేత్తో గుండెని రుద్దుకుంటోంది.

''అలా అయిపోతున్నావేం?'' అడిగాడు చౌదరి కంగారుగా.

''కొంచెం ఛాతీలో నొప్పి



వస్తుందండీ!''

మాటలు పెరిగి రావడం లేదు లలితకి. ఆయాసంతో రొప్పుతోంది. చెమటలు పోస్తున్నాయి.

చౌదరికి ఏమీ తోచలేదు.

రాత్రి పన్నెండవుతుంది. ఆ సమయంలో డాక్టర్లు వుండరు.

ఆమెకి గుండెపోటు వచ్చిందని అర్థమయింది చౌదరికి.

''నేను డాక్టర్ని తీసుకొస్తాను..?'' అంటూ లేవబోయాడు.

కదలవద్దు అన్నట్లుగా సైగచేసిందామె.

''వద్దు నన్ను వదిలి వెళ్లకండి. మీ చేతుల్లో... నన్ను... నన్ను..''

ఆమెని ఒడిలోకి తీసుకున్నాడు చౌదరి

రెండే రెండు క్షణాలు అటూ ఇటూ కొట్టుకుందామె. ఆమెలో చలనం ఆగిపోయింది.

చౌదరి నిర్వికారంగా ఆమెకేసి చూశాను.

లలిత వెళ్లిపోయిందో గొణిగాడు మెల్లగా ఆమెని పడుకోబెట్టాడు.

సిగరెట్ పెట్టె తీశాడు.

లలిత సిగరెట్లు మూడే కాల్చమంది.

అది లలిత ఉంటే తను పాటించవలసిన నియమం. ఇంటికి తాళం వేసి రోడ్డుమీదకి వచ్చాడు చౌదరి. నాలుగిళ్ల అవతల వున్న ఆయన స్నేహితుడు సుబ్బారావు ఇంటికి వెళ్లి ఆయన్ని లేపాడు చౌదరి.

''ఏమిట్రా ఇంత రాత్రి వేళ?'' అన్నాడు సుబ్బారావు.

''ఏం లేదురా! అలా టెలిగ్రాఫ్ ఆఫీసు వరకూ తోడుగా వస్తావా?'' అన్నాడు మెల్లగా చౌదరి.

''ఇప్పుడెందుకు?'' చౌదరి మొహంలోకి చూస్తూ అడిగాడు సుబ్బారావు.

''పిల్లల్ని రమ్మని టెలిగ్రాం ఇవ్వాలి''

''పొద్దున్న ఇవ్వచ్చుగా?''

''ఉదయం బయల్దేరితే సాయంత్రం కన్నా వస్తారు!''

''ఇప్పుడు అవసరం అంటావా''

''ఊ''

''సరే, వస్తానుండు'' అని భార్యని కేకేసి తలుపులు వేసుకోమని చెప్పి చెప్పులు వేసుకుని చౌదరిని అనుసరించాడు సుబ్బారావు. ఇంకో సిగరెట్ వెలిగించాడు చౌదరి. సిగరెట్ పెట్టె తీసుకుని తను కూడా ఓ సిగరెట్ వెలిగించాడు సుబ్బారావు.

''ఇంత అర్జంటు సనేమొచ్చింది పిల్లల్ని రమ్మని టెలిగ్రాం ఇవ్వడానికి''

''లలిత నన్మోసం చేసింద్రా! అది పిల్లలకి తెలియపర్చాలి కదా!''

సుబ్బారావు ఆశ్చర్యంగా చూశాడు.

''అదేం మాటరా! ఇవాళ నీ మారేజ్ డే అని కూడా అన్నావు''

''అవున్రా! ఆఖరి మారేజ్ డే చేసుకున్నాను. నా చేతిలో గొడుగు జారిపోయింద్రా! నాకు తెలీకుండానే పోగొట్టుకున్నాను''

సుబ్బారావు నడుస్తున్నవాడల్లా ఆగిపోయాడు. చౌదరి మొహం గంభీరంగా వుంది.

''లలితకేమన్నా..''

''ఆ... గుండెపోటుతో ఇప్పుడే అరగంట క్రితం చచ్చిపోయింది'' చౌదరి చెప్పాడు.

సుబ్బారావు రెండు నిమిషాలు స్నేహితుని మొహంలోకి చూస్తూ నిలబడిపోయాడు.,

సిగరెట్ పైన సిగరెట్ కాలుస్తున్నాడు చౌదరి.

చౌదరి పరిస్థితి ఎంతో దయనీయంగా కనిపించింది సుబ్బారావుకి.

భార్య చనిపోతే శవాన్ని ఇంట్లో పెట్టి ఇంటికి తాళంవేసి పిల్లలకి టెలిగ్రాం ఇవ్వడానికి బయలుదేరాడతను. ఎంతో జాలి కలిగిందతనికి.

కానీ భార్యపోయిన దుఃఖం అతని మొహంలో కనిపించడంలేదు. మాటల్లో గాంభీర్యం చెక్కు చెదరడంలేదు. గొంతు పొడారిపోలేదు.

టెలిగ్రామ్స్ ఇచ్చాక సుబ్బారావు కావల్సిన వాళ్లని లేపి కబురుచెప్పాడు. సుబ్బారావు భార్య కూడా వచ్చింది. లలిత శవాన్ని ముందు గదిలో పడుకోబెట్టారు. సుబ్బారావు భార్య దమయంతి శవం తల దగ్గర దీపం పెట్టి పక్కనే కూర్చుంది. పిల్లలొచ్చేవరకూ ఆ బాధ్యత తనకి తప్పదని ఆమెకి తెలుసు.

సుబ్బారావు, శివరామయ్య ఇంటిముందు ఆ ఇంట్లో శవం ఉందన్న సూచనగా పిడకల్ని పేర్చి మంట చేశారు.

చౌదరి స్నేహితులు, పేటలోని పెద్దలు చేరారు. సానుభూతి తెలియజేస్తున్నారు.


మర్నాడు సాయంత్రానికి కొడుకులు ముగ్గురు, కూతురు, కోడళ్ళు అల్లుడూ పిల్లలతో సహా వచ్చారు. ఒక్కసారిగా ఏడుపులు మొదలయినాయి.

చౌదరి మాత్రం కంట కన్నీరు పెట్టలేదు.

కొత్త పట్టుచీర కట్టి, పెళ్లి కూతురిలా అలంకరింప జేయబడిన భార్య అంతిమ యాత్రలో గంభీరంగా అనుసరించాడు చౌదరి.

పదో రోజున కర్మం జరిగేక చౌదరితో ''ఒంటరిగా ఈ ఊళ్లో ఏం చేస్తావ్? ఏ కొడుకు దగ్గరకన్నా వెళ్లిపోవడం మంచిది'' అన్నాడు శివరామయ్య.

సుబ్బారావు, చౌదరి కొడుకులతో అదే అన్నాడు. మీ నాయనకి వయసు పైబడింది. తన పనులే తను చేసుకోలేదు. మీరు






రచయితను ఆవరించుకొని రెండు బలీయమైన శక్తులుంటాయి. అవి కొత్త విషయాలను తెలిసేటట్టు చెప్పగలగడం, తెలిసిన

తీసుకెళ్లిపొండి బాబూ''

''నాన్నగార్ని వదిలి పెట్టేస్తామని ఎలా అనుకున్నారు'' అన్నాడు పెద్దకొడుకు.

''మాలో ఎవరి దగ్గరైనా ఆయన ఉండొచ్చు'' రెండోవాడు అన్నాడు.

''అంతా ఆతనిష్ట ప్రకారం జరుగుతుంది'' అన్నాడు మూడోవాడు.

''పెద్దాయన ఇంటికి పెద్దదిక్కుగా ఉంటాడు రమ్మని నేనే అడగాలనుకుంటున్నాను'' అన్నాడు అల్లుడు.

''నిజంగా చౌదరి అదృష్టవంతుడు. రత్నాల్లాంటి బిడ్డల్ని కన్నాడు'' అని ముచ్చటపడ్డాడు సుబ్బారావు.

ఆ రాత్రి బాల్కనీ లో ఒంటరిగా కూర్చున్నాడు చౌదరి.

సిగరెట్ వెలిగించాడు. నిజంగా ఇప్పుడీస్థితిలో తను ఒంటరిగా ఇక్కడ చేసేదేమీలేదు.

ఏ కొడుకు దగ్గర కెళ్లినా మనవరాలు, మనమరాళ్లతో కాలక్షేపం అవుతుంది.

ఒక్కో కొడుకు దగ్గరా కొంతకాలం వుండొచ్చు. ఒక్కరిమీద బరువు మోపకుండా! వాళ్ళు మాత్రం బరువుమోసేదేముంది. తనకి పెన్షన్ వస్తుంది. ఆ పెన్షన్‌తోనే తను, లలిత బ్రతకలేదా. ఇళ్లు అద్దెకిస్తే మరికొంత వస్తుంది. ఇప్పటి వరకు పిల్లల సంపాదన నించి తనేనాడూ ఒక్క రూపాయి ఆశించలేదు. తీసుకోలేదు.

మెల్లగా కిందికివచ్చాడు చౌదరి.

గదుల్లో కోడళ్లతో గుసగుసలు పడుతున్నారు కొడుకులు దేనికోసమో! కొంచెం సేపు వాళ్ల మాటలు ఆలకించాడు చౌదరి. మనసు చివుక్కుమంది. తన గురించే వాళ్ళు చర్చించుకుంటున్నారు. మర్నాడు ఒక్కో కొడుకూ వెళ్లిపోడానికి ప్రయాణమవుతున్నాడు.

''వెళ్లొస్తాం నాన్నా!'' అన్నాడు పెద్దకొడుకు భాస్కర్ ఇంజనీర్.

''మంచిది బాబూ!'' అన్నాడు చౌదరి.

''నాన్నగారూ ఈ రోజే మేము కూడా వెళ్తున్నాం. నాకు సెలవులేదు'' రెండోవాడు కాశీవిశ్వనాథ్ బ్యాంకు ఆఫీసర్.

''క్షేమంగా వెళ్లిరా బాబూ!'' అన్నాడు చౌదరి. మూడో కొడుకు రాజేష్, డాక్టరు.

''అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తుండండి డాడీ! పిల్లలకి స్కూల్ పోతుంది అందుకని...''

''వెళ్తానని చెప్పడానికేగా బాబూ! ఎవరి బతుకులు వాళ్లవి. వెళ్లిరండి'' అన్నాడు చౌదరి.

సిగరెట్ వెలిగించి పొగని గుండెల్లోకి పీల్చి గాలిలోకి విడిచి పెడుతూ కళ్లు మూసుకున్నాడు చౌదరి గంభీరంగా.

''తాతయ్యా''

కళ్లుతిప్పి చూశాడు చౌదరి.

కూతురి బిడ్డ సీత!

''నువ్వు మాతో వచ్చేయ్ తాతయ్యా!'' అడుగుతోంది.

మనవరాల్ని ఒడిలోకి తీసుకున్నాడు చౌదరి.

'నా బంగారుతల్లి' అంటూ ముద్దు పెట్టుకున్నాడు చౌదరి.

''నీకు ఇక్కడ అన్నం ఎవరు పెడతారు. అందుకని నువ్వు మాతో వచ్చేయ్'' అంది తిరిగి సీత.

''సీతా!'' తల్లి గొంతు వినబడి చూసింది సీత.

చౌదరి కూతురు రాజ్యలక్ష్మి తండ్రి దగ్గరికి వచ్చింది.

''తాతయ్య మనింటికి రాడమ్మా! నిన్ను వెళ్ల డాడీ పిలుస్తున్నారు!'' అంది మందలింపుగా రాజ్యలక్ష్మి.

సీత వెళ్లిపోయింది.

కూతురికేసి చూశాడు చౌదరి.

''వెళ్తున్నానని చెప్పడానికేగా వచ్చావ్. క్షేమంగా వెళ్లమ్మా!''

''అలాగే నాన్నా! ఓ చిన్న విషయం..''

''అడుగు తల్లీ!

''అమ్మ నగలు.. నాకే చెందుతాయి కదా! మీ అల్లుడుగారు అడగమంటున్నారు'' అంది మెల్లగా.

చిరునవ్వు నవ్వాడు చౌదరి.

''బీరువాలో ఉన్నాయి. తీసుకెళ్లమ్మా!'' అన్నాడు.

అందరూ వెళ్లిపోయారు.

చౌదరి ఒంటరిగా మిగిలిపోయాడు.

రాత్రి బాల్కనీలో కూర్చుని సముద్రం కేసిచూశాడు.

చల్లగా గంభీరంగా హోరు పెడుతోంది సముద్రం.

ఆవేదనా దుఃఖం అప్పటివరకూ గుండెలో తొక్కిపెట్టిన చౌదరి గుండె అగ్నిపర్వతంలా బద్దలవ్వడానికి సిద్ధంగా వుంది.

ఎదురుగా లలిత కూర్చునే కుర్చీ ఖాళీగా వుంది.

''లల్లీ! నువ్వెంత అదృష్టవంతురాలివో నాకిప్పుడు అర్థం అయిందే! నువ్వు జారిపోయావని బాధపడ్డానేగానీ ఇప్పుడనిపిస్తోంది. నేనే పోయి నువ్వు వుంటే నీ పరిస్థితి ఎలా వుండేదో ఊహించలేకపోతున్నాను'' అంటూ బావురుమన్నాడు చౌదరి.

చౌదరి రోదనముందు సముద్రపుహోరు వెలవెల బోతోంది.

అప్పటివరకు గంభీరంగా ఉన్న సముద్రంలా వున్న చౌదరి వాయుగుండం పడిన సముద్రంలా దుఃఖం గుండెల్లోంచి తన్నుకొస్తుంటే బోరున విలపిస్తున్నాడు.

